గణపతి బప్పా మోరియా

సాక్షి బృందం: మడకశిర, అమరాపురం, రొళ్ల, రొద్దం, పావగడలో శనివారం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను వివిధ వాహనాలపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. యువకులు, మహిళలు, చిన్నారులు డప్పు వాయిద్యాలకు అనుగుణంగా చిందులు వేశారు. అనంతరం ఆయా ప్రాంతాలకు సమీపంలో ఉన్న చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఇదిలా ఉండగా హిందూపురంలో శనివారం మూడో రోజు వినాయక నిమజ్జనం ముగిసింది.


మడకశిరలో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకువెళుతున్న దృశ్యం


గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకులు


రొద్దంలో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య


హిందూపురం గుడ్డం కోనేరులో వినాయక నిమజ్జనం


మడకశిరలో నిమజ్జనానికి తరలుతున్న భారీ వినాయకుడి విగ్రహం


రొద్దంలో భక్తులకు అన్నదానం చేస్తున్న ముస్లింలు


పావగడలో గణపయ్యను ఊరేగిస్తున్న భక్తులు


అమరాపురంలో మంగళూరు కళాకారుల నృత్య ప్రదర్శన


అమరాపురంలో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు


రొళ్ల మారుతి కాలనీలో గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


అమరాపురంలో డప్పు కళాకారుల సందడి

అన్నదాత పోరును విజయవంతం చేయండి

మడకశిర: పెనుకొండ ఆర్డీఓ కార్యాలయం వద్ద ఈనెల 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాత పోరును విజయవంతం చేయాలని మడకశిర నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ఈర లక్కప్ప పార్టీ శ్రేణులను కోరారు. ఆయన శనివారం మడకశిరలో అన్నదాత పోరు పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రధానంగా యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ పూర్తి స్థాయిలో ఇవ్వలేదన్నారు. ఉచిత పంటల బీమా లేదన్నారు. సున్నా వడ్డీ పథకం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వ మెడలు వంచి అన్నదాతలకు న్యాయం చేయడానికే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు అన్నదాత పోరును నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్, అగళి మండల కన్వీనర్ శ్రీనివాస్, ఎంపీపీ సత్యనారాయణ రెడ్డి, పార్టీ నియోజకవర్గ వివిధ విభాగాల అధ్యక్షులు శేషాద్రి, మల్లికార్జున, శివానంద, సికిందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ జయరాజ్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ వివిధ కమిటీల సభ్యులు సత్యనారాయణయాదవ్, కరియన్న, తిమ్మప్ప, మంజునాథ్, రంగనాథ్, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న ఈరలక్కప్ప, నాయకులు

మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష

మడకశిర: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆరోపించారు. శనివారం పట్టణంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో మిథున్‌రెడ్డికి రెగ్యులర్ బెయిల్ మంజూరు కావాలని ఆకాంక్షిస్తూ ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈరలక్కప్ప మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష గట్టి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని వేధిస్తున్నారని ఆరోపించారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపారని విమర్శించారు. లిక్కర్ స్కాం జరగక పోయినా కూటమి ప్రభుత్వం ఈకేసును సృష్టించి వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపుతోందని ధ్వజమెత్తారు. మిథున్‌రెడ్డి ఈకేసు నుంచి కడిగిన ముత్యంలా బయటపడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి,కుంచిటి వక్కలిగ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి,మాజీ మున్సిపల్ చైర్మన్ జయరాజ్, మండల కన్వీనర్ రామిరెడ్డి, పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్,అగళి మండల కన్వీనర్ శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ నాగరాజగౌడ్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం సభ్యులు సత్యనారాయణ యాదవ్, తిమ్మప్ప, నియోజకవర్గ స్థాయి నాయకులు శేషాద్రి, సికిందర్, మల్లికార్జున, శివానంద, ఎంపీపీ సత్యనారాయణరెడ్డి, స్థానిక నాయకులు మంజునాథ్, బాలకృష్ణారెడ్డి, కరియన్న, హనుమంతు, రంగనాథ్, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఈరలక్కప్ప, నాయకులు

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి

రొళ్ల: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మహిళలు, ఆర్డీటీ మహిళ సంఘాల సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కాకి పంచాయతీ కేంద్రంలో మహిళలు, ఆర్డీటీ మహిళ సంఘాల సభ్యులు, ప్రజలతో కలిసి గ్రామ పుర వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1969లో ఆర్డీటీ సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి వేలాది నిరుపేద కుటుంబాలు అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. పేదప్రజలను దృష్టిలో పెట్టుకుని ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరుపేదల ఆగ్రహానికి గురికాక తప్పదని మహిళలు హెచ్చరించారు. అనంతరం పంచాయతీ తరఫున తీర్మానం చేసి కేంద్ర హోం శాఖ సెక్రటరీకి సిఫారసు లేఖను పంపాలని సర్పంచు లక్ష్మమ్మకు వినతి పత్రాన్ని అందజేశారు.


సర్పంచ్ లక్ష్మమ్మకు వినతి పత్రం అందిస్తున్న మహిళలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

హిందూపురం: పట్టణ సమీపంలో శనివారం రాత్రి సడ్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. సడ్లపల్లికి చెందిన శ్యామలమ్మ (82) తన అల్లుడు రాముతో కలిసి రోడ్డు దాటుతుండగా వేగంతో వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శ్యామలమ్మ మృతి చెందింది. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన శ్యామలమ్మ

ఇంటింటి సర్వే బహిష్కరిస్తున్నాం

హిందూపురం: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటి సర్వే బహిష్కరిస్తున్నామని వార్డు సచివాలయ కార్యదర్శులు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం కమిషనర్ చాంబర్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు చేయాల్సిన పనులను తమకు అప్పగించడం సరికాదన్నారు. కార్యదర్శులకు జాబ్ చార్ట్ ఏర్పాటు చేయాలని, మాతృశాఖలో విలీనం చేసి ఆశాఖ అధికారులు మాత్రమే పర్యవేక్షణ చేసేలా చూడాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి కార్యదర్శులకు న్యాయం చేయాలని కోరారు.

రొళ్ల: తమపై పని ఒత్తిడిని తగ్గించాలని సచివాలయాల ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సచివాలయాల ఉద్యోగులు మండల పరిషత్ ఏఓ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయాల ఉద్యోగులు మాట్లాడుతూ ప్రభుత్వం సర్వేల పేరుతో పనిభారం మోపుతోందన్నారు. ఆత్మగౌరవం దెబ్బతినేలా పనులు అప్పగించడం సరికాదన్నారు.


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వార్డు కార్యదర్శులు

సంక్షిప్త సమాచారం

పంచాయతీ కార్యదర్శికి పదోన్నతి

లేపాక్షి: పులమతి పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య గ్రేడ్‌–4 నుంచి గ్రేడ్‌–3గా పదోన్నతి పొందినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి శనివారం తెలిపారు. ఈయన గ్రేడ్‌–3 పంచాయతీ అయిన కల్లూరుకు నియమితులయ్యారన్నారు.

లారీ బోల్తా

చిలమత్తూరు: మండలంలోని కోడూరు థామస్ మఠ్రో తోపు సమీపంలోని 44 వ నంబరు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున లారీ బోల్తా పడింది. లోడ్‌తో వెళుతున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

హిందూపురం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు కిశోర్, వెంకటరమణ నాయక్ సూచించారు. హిందూపురం మండలం తూముకుంట చెక్‌పోస్టులో వాసవ్య మహిళా మండలి విప్రో కేర్స్ సహకారంతో కుషాల్ హెల్త్ కేర్ క్లినిక్ ద్వారా ఉచిత గుండె, కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. సరైన సమయంలో నిద్ర, మంచి ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం వంటివి చేయాలని తెలియజేశారు. మొత్తం 188 మంది రోగులకు కంటి, 2డీ ఎకో తదితర పరీక్షలు చేసిన అవసరమైన వారికి మందులు అందించారు. కంపెనీ ఈడీ విజయ్‌కుమార్, కుషాల్ హెల్త్ కేర్ క్లినిక్ డాక్టర్ సల్మా, మిజ్బా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

పరిగి: క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తహసీల్దార్ హసీనా సుల్తానా విద్యార్థులకు సూచించారు. శనివారం ఆమె మండలంలోని ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటూ క్రీడలు ముఖ్యమన్నారు. బాగా చదువుకుని సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల నిర్వహణపై విద్యార్థులతో ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శేషాచలం, పాఠశాల ప్రిన్సిపాల్ మత్స్యరాజు, ఆర్‌ఐ సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

హిందూపురం టౌన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగాఉత్తమఅవార్డు అందుకున్న ఉపాధ్యాయులు విజయరాణి, షమీం తాజ్, విజయభార్గవి, కేశవమూర్తి, నాగరాజు, ఎంఐఎస్ నందిని, పీటీఐ పాండును శనివారం ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈఓఆర్‌డీ శివకుమార్, నారాయణస్వామి, బాబు, చెన్నకేశవులు, గోపాల్, బాలానారాయణ స్వామి, నాగమణి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అమరాపురం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బంది మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురవడంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అప్రమత్తండా ఉండి వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

గుడిబండ: మండలంలోని నాగేపల్లి రైతు సేవా కేంద్రంలో శనివారం ఏఓ వీరనరేష్, తహసీల్దార్ శ్రీధర్ రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఏఓ వీరనరేష్ మాట్లాడుతూ కరికెర, చిగతుర్పి, నాగేపల్లి గ్రామ ప్రజలకు 280 యూరియా బస్తాలను పంపిణీ చేశామన్నారు. మిగితా రైతులకు అందరికీ అందిస్తామని తెలియజేశారు.

9న 5కె రెడ్ రిబ్బన్ మారథాన్

హిందూపురం టౌన్ : ఈనెల 9న పట్టణంలో 5కె రెడ్ రిబ్బన్ మారథాన్ నిర్వహించనున్నట్లు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సునిల్ శనివారం తెలియజేశారు. డిగ్రీ విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చని, గతేడాది నిర్వహించిన పోటీలో గెలిచి ఉండరాదన్నారు. 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు విద్యార్థులు జిల్లాలో ఏదైనా కాలేజీలో డిగ్రీ చదువుతూ ఉండాలన్నారు. మారథాన్ పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్ల విభాగాల్లో ఉంటుందన్నారు. 9వ తేదీ 5:30కు హిందూపురం మున్సిపల్ ఆఫీస్ వద్దకు చేరుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ తర్వాత మారథాన్ ప్రారంభమవుతుందన్నారు.

క్లుప్తంగా

అనంత పద్మనాభస్వామికి ప్రత్యేక పూజలు


హోమాలు చేస్తున్న భక్తులు

మడకశిర: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో రెండో రోజు శనివారం అనంతపద్మనాభస్వామికి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన 35 జంటలు హోమాల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వేదపండితులు అనంతపద్మనాభస్వామి వ్రతం ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

బాధితులకు పరామర్శ


అనారోగ్య బాధితులను పరామర్శిస్తున్న ఉషశ్రీచరణ్

రొద్దం(పరిగి): రొద్దం మండలం చిన్నమంతూరు గ్రామంలో శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. కొంత కాలంగా స్థానిక సర్పంచ్ సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నేత హనుమంతరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈసందర్భంగా ఉషశ్రీచరణ్ వారిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అధికారుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ


పెనుకొండలో దుకాణాల వద్ద యూరియా కోసం గుమిగూడిన రైతులు

పెనుకొండ: పట్టణంలో శనివారం పలు గ్రామాల రైతులకు అధికారుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ చేశారు. పలు ఏజెన్సీలకు 3 రోజుల క్రితమే యూరియా చేరినా ప్రభుత్వం పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుమార్లు దుకాణాల చుట్టూ తిరుగుతూ యూరియా కోసం ఒత్తిడి తెచ్చారు. ఈనేపథ్యంలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారుల సమక్షంలో పంపిణీ కార్యక్రమం సాగింది.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుబ్బారావు

లేపాక్షి: పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కంటి వైద్య నిపుణులు ఎంవి. సుబ్బారావు విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 200 మందికి పరీక్షలు నిర్వహించి అందులో 17 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా కంటి అద్దాలను ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హరిక్రిష్ణ, సీహెచ్‌ఓ శ్యామల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

పెనుకొండ: పట్టణంలోని జగనన్న వైఎస్సార్ కాలనీలో శనివారం టింబక్ట్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయసేవా సదస్సు నిర్వహించారు. దుర్గాశక్తి సొసైటీ అధ్యక్షులు లక్ష్మమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పెనుకొండ, సోమందేపల్లి మండలాలకు చెందిన పలువురు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు పని ప్రదేశాల్లో ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు అనే విషయాన్ని నాటిక ద్వారా తెలియజేశారు. మహిళా చట్టాలను వివరించారు. ప్రోగ్రాం అసోసియేట్స్ రవళి, సీఈఓ రమీజా, కాంచన, లక్ష్మీదేవి, ముంతాజ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వాల్మీకి సర్కిల్ వద్ద బైక్ ఢీ కొని బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలకేంద్రానికి చెందిన పద్మ ఏడేళ్ల కుమారుడు నడుచుకుంటూ వెళ్తుండగా బైక్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

వినాయక లడ్డూ రూ.54 వేలు


లడ్డూను దక్కించుకున్న దేవరాజ్

పావగడ: పట్టణంలోని మూడు ముఖాల నేల ప్రాంతంలో వెలసిన నల్ల రాళ్ళ గంగమ్మ, ఏడుగురు అక్కమ్మ గార్ల ఆలయం వద్ద ప్రతిష్టించిన వినాయకుడి లడ్డూను శనివారం వేలం వేశారు. స్థానిక శాంతి మెడికల్స్ యజమాని దేవరాజ్ రూ.54 వేలకు దక్కించుకున్నాడు. అలాగే గంగమ్మ దేవాలయం రథం నిర్మాణానికి తన వంతుగా రూ.9 వేలు విరాళం అందించాడు.

ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు


అవార్డులు స్వీకరించిన ఉపాధ్యాయులు

పావగడ: తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్ హనుమేశ్, జాజూరాయనహళ్ళి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బీ ఎస్ రాఘవేంద్ర ఈ ఏడాది కి సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. మధుగిరి లోని మలి మారయప్ప మీటింగ్ హాల్ లో శనివారం జరిగిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో డీడీపీఐ మాధవరెడ్డి చేతుల మీదుగా వారు అవార్డులు స్వీకరించారు. ఈ అవార్డులు తమకు మరింత బాధ్యత పెంచాయని వారు పేర్కొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

పావగడ: పట్టణంలోని శని మహాత్మ ఆలయం వెనుక భాగంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు స్థానిక సమాజ సేవకులు డా ధీరజ్‌రెడ్డి, మను మహేశ్, గంగినేని దేవరాజ్ కంప్యూటర్, యూపీఎస్‌ను శనివారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య ను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం మారుతీశ్, ఉపాధ్యాయురాలు ఆదిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభుడికి పూజలు

హిందూపురం: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని అనంత పద్మనాభస్వామి ఆలయంలో శనివారం అనంత చతుర్దశి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత అనంత వ్రతం, మహాగణపతి, ఆదిత్యాది నవగ్రహ శ్రీమన్నారాయణ హోమం చేపట్టారు. అనంతరం పద్మానాభ లక్ష్మిదేవి వారి ఉత్సవమూర్తులకు కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం జరిగింది. సాయంత్రం స్వామి ఉత్సవ మూర్తులకు ఉయ్యాల ఉత్సవం నిర్వహించారు.